క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై హర్షం

తెనాలిఅర్బన్: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై టీడీపీ ఎస్సీసెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు సోపాటి కిరణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చిలకా కిరణ్ మాదిగలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత లభించడాన్ని స్వాగతిస్తూ సోపాటి కిరణ్ ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీలోని మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బి.ప్రసాద్, గాజులవర్తి సురేష్, కొక్కిలగడ్డ మనోజ్, తంగిరాల మనోజ్, బాలనాగమ్మ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ నుంచే హజ్ యాత్ర కొనసాగించాలి



దుగ్గిరాల: పవిత్ర హజ్ యాత్రకు విజయవాడ నుంచే హజ్ యాత్రను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. దుగ్గిరాల ముర్తజానగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో హజ్ యాత్రకు వెళ్లేందుకు రాష్ట్రంలోని ముస్లింలు హైదరాబాద్, బెంగళూరు చేరుకొని ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేదన్నారు. ఆ విషయాన్ని అప్పటి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి ముస్లిం పెద్దలు తీసుకెళ్లారని గుర్తుచేశారు. స్పందించిన ఆయన హజ్ యాత్రికుల సౌలభ్యం కొసం 2023 విజయవాడలో విమానాశ్రయం నుంచి ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేసి హజ్ యాత్రకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. టిక్కెట్టు ధర పెరగటం వల్ల ఒక్కో హజ్ యాత్రికునికి రూ.83 వేలు అదనపు భారం పడుతోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరించి హజ్ యాత్రికులకు ఆర్థికంగా అండగా నిలబడిందన్నారు. ప్రస్తుతం హజ్ కోసం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి విజవయవాడ ఎంబార్కేషన్ పాయింట్ కొనసాగంచాలని డిమాండ్‌చేశారు. యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి, అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ జాను సాహెబ్, షేక్ సమీ ఉల్లా పాల్గొన్నారు.

కాలువలో పడిన ఆవు.. రక్షించిన స్థానికులు



మంగళగిరి టౌన్: కాలువలో ఇరుక్కుపోయి ఇబ్బందిపడుతున్న ఆవును స్థానికులు మున్సిపల్ సిబ్బందితో కలసి రక్షించిన ఘటన మంగళగిరి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. మంగళగిరిలోని పాత మంగళగిరి బోసుబొమ్మ సెంటర్ వద్ద ఒక ఆవు ప్రమాదశాత్తు కాలువలో పడిపోయింది. స్థానికులు మున్సిపల్ వర్కర్లకు సమాచారం ఇచ్చి, వారితో కలసి రెండు గంటలకు పైగా శ్రమించి ఆవును కాలువలోంచి బయటకు తీసి కాపాడారు. మూగజీవిని కాపాడినందుకు స్థానికులు మున్సిపల్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

తక్కువ శ్రమతో ఆదాయాన్ని పొందండి

తాడేపల్లిరూరల్ : తక్కువ శ్రమతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఖాదీ గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఎస్. గ్రీస్ అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని నులకపేటలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీస్ మాట్లాడుతూ గ్రామ ఉద్యోగ వికాస్ యోజన ద్వారా తక్కువ శ్రమతో అధిక ఆదాయం పొందవచ్చని, వ్యవసాయ ఆధారిత ఆహార పరిశ్రమలు (ఆగ్రో బెస్ట్‌ఫుడ్ ఇండస్ట్రీస్) ద్వారా సాధ్యమని వివరించారు. టూల్స్ ఎక్విప్‌మెంట్ ద్వారా బహుళ ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ వివిధ విభాగాల అధికారులు, రమేష్, ఆనందకుమార్, మూర్తి, టివి రావు, విజయరాయ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పులను అమలు చేయాలి

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కె.ఆదినారాయణతో కలసి ప్రారంభించారు. శివమ్మ, యహోషువా, అంకయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత తెనాలికి అడుగులు

- ఇప్పటికే పలు దుకాణాలపై దాడులు
- ప్లాస్టిక్ వస్తువులు వాడవద్దని సూచన
- ఇటీవల 775 కేజీలు ప్లాస్టిక్ వస్తువుల సేకరణ
- పట్టణంలో అయిదు బృందాలు ఏర్పాటు





ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న మహిళలు

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ రహిత తెనాలి ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇటీవల మున్సిపల్ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు 120 మైక్రాన్‌ల తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు సీజ్ చేస్తున్నారు. అంతేకాకుండా హోల్‌సెల్ షాపుల నిర్వాహకులకు వాటిని విక్రయించవద్దని హెచ్చరికలు జారీ చేయటంతో పాటు ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. కవర్లు, వస్తువులు విక్రయించే వారి నుంచి పెద్ద మొత్తంలో అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. దీంతో వ్యాపారులు క్లాత్, జూట్ సంచుల విక్రయాలు ప్రారంభించారు.

తెనాలి పట్టణంలో సుమారు రెండు లక్షల జనాభా ఉంటారు. వీరు కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి ఇక్కడికి ప్రతిరోజు సుమారు 10 వేల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఇక్కడ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు హోల్‌సేల్‌గా విక్రయించే షాపులు సుమారు 8 వరకు ఉంటాయి. వీరు చెన్నై, హైదరాబాద్‌ల నుంచి ఎక్కువగా తక్కువ మందంగా కలిగిన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు తెప్పించి విక్రయిస్తుంటారు. వీరి నుంచి పట్టణంలో ఉన్న సుమారు అయిదు వేల మంది దుకాణ దారులు, చిరు వ్యాపారులు వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. వీటిని ప్రజలు ఉపయోగిస్తుంటారు.

సుప్రీం ఆదేశాలతో కదలిక

120 మైక్రాన్ల తక్కువ మందం ఉన్న వస్తువులు, కవర్ల వినియోగం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, వాటిని ఎవరు విక్రయించకుండా, ఉపయోగించకుండా చూడాలని ప్రభుత్వాలకు దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీంతో పాలకులు అప్పటి నుంచి గుర్తువచ్చినప్పుడు హడావిడి చేయటం.. తర్వాత ఆ విషయాన్ని వదిలేయటం పరిపాటిగా మారింది. తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా రెండు నెలల నుంచి హోల్‌సెల్ షాపుల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి వాటి విక్రయాలు ఆపాలని సూచించారు. అలాగే మార్కెట్‌లోని పలు షాపులను తనిఖీ చేసి తక్కువ మందం ఉన్న వస్తువులు, కవర్లు సీజ్ చేశారు. అంతేకాకుండా ఈనెల 15వ తేదీన మార్కెట్ వద్ద ప్లాస్టిక్ వస్తువుల సేకరణ జరిపారు. కేజీ ప్లాస్టిక్ వస్తువులు ఇచ్చిన వారికి కేజీ పంచదార, సేమ్యా, కోడిగుడ్లు వంటి వస్తువులను ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కరోజు సుమారు 775 కేజీల ప్లాస్టిక్ వచ్చింది. దీనిని బట్టి చూస్తే తెనాలిలో ఏ మేరకు వీటి విక్రయాలు జరుగుతున్నాయో మనకు అర్థమౌతుంది.

ప్లాస్టిక్ రహిత తెనాలికి కృషి



ప్లాస్టిక్ రహిత తెనాలిగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. హోల్‌సెల్ షాపులపై దాడులు చేసి పెద్ద మొత్తంలో అపరాధ రుసుం విధిస్తున్నాం. త్వరలో పోలీస్, పాల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల సహకారంతో గొడోన్లపై దాడులు చేస్తాం. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. తెనాలిలో అయిదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. వారితో 120 మైక్రాన్లలోపు మందం ఉన్న ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

–బండి శేషన్న, కమిషనర్

ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు ఇవి

1. పర్యావరణంపై దృష ప్రభావం.. ప్లాస్టిక్ కచ్చితంగా కరుగదు. ఇది వందల సంవత్సరాలు నేలలో ఉంటు భూమిని కలుషితం చేస్తుంది.
2. వాతవారణ కలుషితం... ప్లాస్టిక్ తయారీకి పెట్రోలియం ఉత్పత్తులను ఉపయోగిస్తారు. ఇవి గాలి కాలుష్యాన్ని పెంచుతాయి.
3. జంతువులకు హాని..రోడ్లపై, సముద్రంలో ప్లాస్టిక్‌ను పడేయటం వల్ల పశువులు, జలచరాలు దీన్ని తిని మరణించే అవకాశం ఉంది.
4. మట్టి నాణ్యత తగ్గింపు.. మట్టిలో కరగకుండా ప్లాస్టిక్ అలా ఉండటం వల్ల దానిలో నాణ్యత తగ్గే అవకాశం ఉంది. పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉంది.
5. డ్రెయినేజ్ సమస్య... ప్లాస్టిక్ వస్తువులను మురుగు కాల్వల్లో వేయటం వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. అలాగే కాల్వల్లో పారుదల లేకుండా అడ్డుపడతాయి. వరదలకు ఇవి కారణంగా మారతాయి.
6. మానవ ఆరోగ్యంపై ప్రభావం.. ప్లాస్టిక్ మైక్రో పార్టికల్స్ ఆహారం, నీటి ద్వారా మన శరీరంలోకి వెళ్తే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే క్యాన్సర్ వచ్చేందుకు ఇది కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ఇన్ని దుష్పరిణామాలు ఉన్న నేపథ్యంలో అందరూ వీటికి దూరంగా ఉంటే భవిష్యత్ తరాలకు మేలు చేసిన వారమౌతాం. ఆ దిశగా ప్రభుత్వాలు, అధికారులు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.



ప్లాస్టిక్ భూతం వేషధారణలో వ్యక్తి

ఈకేవైసీ తప్పక చేయించాలి

తెనాలి: ఇప్పటికీ ఈకేవైసీలో లేని రేషను కార్డుదారులు వెంటనే సంబంధిత డీలరు/వీఆర్‌వో వద్ద తప్పనిసరిగా చేయించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలి పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని 18 మండలాల్లో 5,89,531 బియ్యం కార్డులు ఉండగా, వీటిలో 16,57,609 కుటుంబ సభ్యుల యూనిట్లు ఉన్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 15,06,347 మంది సభ్యులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన 1,51,262 మంది కూడా రేషను కార్డునందు ఈకేవైసీ చేయించుకోవాలని, అప్పుడు మాత్రమే రైస్‌కార్డునందు యాక్టివ్‌గా ఉంటుందని వివరించారు. ఈకేవైసీ చేయించుకోని వారి వివరాలు సంబంధింత రేషను దుకాణం డీలర్ వద్ద లభిస్తాయనీ, కార్డుదారుని రైస్‌కార్డుపై వారికి కేటాయించిన రేషను దుకాణం నంబరు ఉంటుందని సూచించారు. సంబంధిత కార్డుదారులు తమ రేషను డీలర్ వద్ద గల ఈ–పోస్ మిషనులో లేదా సంబంధిత వీఆర్‌వో వద్ద తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా పొందాలంటే రేషను కార్డులోని అందరి సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

చెక్కుల పంపిణీ

మంగళగిరి టౌన్: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన నగదు చెక్కులను గురువారం పలువురు బాధితులకు టీడీపీ నాయకులు అందజేశా రు. అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి పట్టణంలోని 6వ వార్డుకు చెందిన ఆకులూరి ప్రసన్నకుమార్‌కు రూ.8,41,988, 15వ వార్డుకు చెందిన మంచాల శ్యామ్‌సుందర్‌కు రూ.50, 891, 12వ వార్డుకు చెందిన మొహమ్మద్ సాధిక్ కు రూ.20,541, 9వ వార్డుకు చెందిన గంజి లీలకు రూ.1,00,290ల నగదు చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి



స్థానికులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. పట్టణంలోని 8,9 వార్డులలో అసిస్టెంట్ కలెక్టర్, మార్కెట్ ఏరియాలో కమిషనర్ గురువారం పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.


అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్

ఎందుకీ తాత్సారం!

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు సిబ్బంది మీనమేషాలు
- అన్నీ సమకూరినా వైరు లేదంటూ సాకులు
- పంటలకు నీటితడుల కోసం రైతుల ఆందోళన

తెనాలి: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటంలో సంబంధిత శాఖ తాత్సారం చేస్తుండటం రైతులను విస్మయానికి గురిచేస్తోంది. కనెక్షను వస్తుందన్న భావనతో వేసిన పైరుకు నీరు అందించలేక, పంట నష్టపోతామని ఆందోళన వారిని కలచివేస్తోంది. విద్యుత్ స్తంభాలు వేయటం, ట్రాన్స్‌ఫార్మరు బిగించటం వరకు అన్నింటిలోనూ జాప్యం జరుగుతోంది. చివరకు అన్నీ సిద్ధమైనా అవసరమైన వైరు లేదన్న కారణంగా విద్యుత్ కనెక్షను ఇవ్వటంలేదు. రబీ పైర్లకు చివరి దశలో పెట్టాల్సిన నీటితడుల కోసం రైతులు ఇక్కట్లు పడుతున్నారు.

తెనాలి రూరల్ మండలం నందివెలుగు–అత్తోట గ్రామాల మధ్యలో గల పంటపొలాలకు సంబంధించిన రైతులు నలుగురు గ్రూపుగా వ్యవసాయ విద్యుత్ కనెక్షను కోసం గతేడాది దరఖాస్తు చేశారు. వీరిలో ముగ్గురి పంట పొలాలు నందివెలుగు పంచాయతీ పరిధిలోనూ, ఒకరి పొలం కంచర్లపాలెం పరిధిలోకి వస్తాయి. కనెక్షను కోసం దరఖాస్తు చేసిన రెండు నెలలకు విద్యుత్ శాఖ అధికారులు డిమాండ్ నోటీసులు పంపారు. ఆ ప్రకారం డిమాండ్ నోటీసులు వచ్చిన నాలుగు రోజుల్లోనే అంటే, గతేడాది జులై 30న డెవలప్‌మెంట్ ఛార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్ ఛార్జీలు కలిపి ఒక్కొక్కరు రూ.18,480 చెల్లించారు. ఇక అక్కడి నుంచి విద్యుత్ శాఖ కార్యాచరణ తాపీగా మొదలైంది. అవసరమైన విద్యుత్ స్తంభాలు వేసి, లైను లాగేందుకు ఏడెనిమిది నెలలు సమయం తీసుకుంది. తర్వాత వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను, దగ్గర్లోని పెట్రోలు బంకులో 40 రోజులుపైగా ఉంచారు. దరఖాస్తుదారుల పదేపదే అధికారులను సంప్రదిస్తుండటంతో ఎట్టకేలకు కొద్దిరోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. ఇక తుదిదశలో విద్యుత్ కనెక్షను ఇవ్వటం నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ నుండి పంటపొలాల్లోని మోటారు షెడ్డుకు కనెక్షను ఇచ్చేందుకు అవసరమైన విద్యుత్ వైరు లేదన్న సాకుతో సిబ్బంది తాత్సారం చేస్తున్నట్టు రైతులు చెప్పారు. ప్రస్తుతం పంటపొలాల్లో జొన్న, మొక్కజొన్న ఉన్నాయి. వీటికి నీటితడుల ప్రాధాన్యత తెలియంది కాదు. కీలక దశలో ఆయా పంటలకు నీటితడులు ఇవ్వకపోతే దిగుబడులు తగ్గిపోతాయన్న ఆందోళన రైతులను పీడిస్తోంది. అన్నీ ఏర్పాటుచేసి కేవలం వైరు లేదన్న కారణంతో విద్యుత్ కనెక్షనుకు జాప్యం చేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



విద్యుత్ స్తంభానికి బిగించిన ట్రాన్స్‌ఫార్మరు



ట్రాన్స్‌ఫార్మరు నుంచి లేని కనెక్షను వైరు

ఆశలన్నీ జొన్నపైనే

- ఖరీఫ్ పైరు దెబ్బతినడంతో రబీగా చేపట్టిన మొక్కజొన్న
- ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతుకు లాభసాటి



కండె దశలో ఉన్న మొక్కజొన్న పైరు

తెనాలిటౌన్: ఆరుగాలం కష్టించే రైతన్నకు పండించిన పంట చేతికొచ్చి అమ్ముకునే దాకా గుండెల్లో రైలు పరిగెడతాయంటే ఏ మాత్రం అతిశయోక్తి లేదు. తెనాలి ప్రాంతంలో ఖరీఫ్, రబీ పంటలు రైతన్నలు విస్తారంగా పండిస్తారు. అయితే ఇటీవల కాలంలో వరుసగా తుఫాన్‌లు, భారీ వర్షాలు వంటి ఉపద్రవాలు తలెత్తుతుండటంతో రైతన్నలకు పంట దిగుబడి తగ్గి అప్పుల పాలవుతున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆరంభంలోనే వరుసగా రెండు తుఫాన్‌లు రావడంతో వరిసాగు భారీగా దెబ్బతిని రైతన్నలు అష్టకష్టాల పాలయ్యారు. తెనాలి ప్రాంతంలో కౌలు ఎకరాకు 20 నుంచి 26 బస్తాలు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు పెట్టుబడి ఖర్చులు మోపెడు కావడంతో రైతన్నకు వ్యవసాయం భారంగా మారింది. ప్రస్తుతం

ఆశలన్నీ రబీ సాగు జొన్న, మొక్కజొన్న పైనే

తెనాలి నియోజకవర్గంలో మొక్కజొన్న 12567 ఎకరాల్లో పండిస్తుండగా, జొన్న 13371 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కొల్లిపర మండలంలో జొన్న పైరు అధికంగా వేయగా, తెనాలి మండలం మొక్కజొన్న విస్తరంగా సాగు చేస్తున్నారు. జొన్న, మొక్కజొన్నకు పెట్టుబడి వ్యయం దాదాపు రూ.30,000 ల వరకు అవుతుందని రైతులు చెబుతున్నారు. దళారులు, ప్రవేట్ వ్యాపారులు రైతులకు ముందస్తుగా డబ్బులిచ్చి పంట అరకొర ధరతో కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటిస్తే దళారుల నుంచి రైతన్నలను రక్షించిన వారవుతారని కోరుతున్నారు. జొన్న, మొక్కజొన్న ఈ నెలాఖారు లేదా, ఏప్రిల్ మొదటి వారంలో పంట కోతకు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

వీల్‌చైర్ల బహూకరణ

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం చేస్తున్న సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం తెనాలిల్లోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు నాలుగు వీల్ చైర్లను బహూకరించింది. క్లబ్ అందిస్తున్న సేవలను వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అభినందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు, వయోవృద్ధులు, వివిధ కారణాలతో నడవలేని రోగులకు ఉపకరించేలా వీల్ చైర్స్‌ని అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, రోటరీ సభ్యులు గుమ్మడి ప్రసాద్, నల్లూరి వెంకటేశ్వరరావు, షేక్ సుభాని, కొత్తపల్లి సుబ్బారావు, కొల్లి రాజేంద్రప్రసాద్, పాలడుగు శ్రీనివాసరావు, సోమవరపు సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

దుగ్గిరాల: జీవ ఎరువులు వాడటం వల్ల రైతుకు అధిక లాభాలు వస్తాయని జిల్లా కో–ఆర్డినేటర్ సునీత అన్నారు. దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు చేరువ అవ్వాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది ఏఈవో శిరీష, వీఏఏలు, డీఆర్‌డీఏ, ఏపీఎం, సీసీలు, ఆరు గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సీఎస్ఈ హానర్స్, ఫార్మసీ కళాశాల వలంటీర్లు చిర్రావూరు గ్రామంలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ పోషకాహార లోపంతో క్షయవ్యాధి సోకే ప్రమాదం ఉందని తెలిపారు. వలంటీర్లు క్షయవ్యాధి వ్యాపి, చికిత్స విధానం, నివారణ మార్గాలను ఇంటింటికి తిరిగి వివరించారని చెప్పారు. డాట్స్ చికిత్స విధానంతో మందులు సరిగా తీసుకుంటే ఆరు నెలల్లో వ్యాధిని తగ్గించవచ్చని వివరించారు. ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. సుప్రియ, విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఎస్ఎస్ఎస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్, వలంటీర్లను యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎస్ వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

చర్మ సంరక్షణపై అవగాహన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ మనస్విత

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో గురువారం చర్మ సరంక్షణపై ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ మనస్విత విచ్చేసి, మాట్లాడారు. వేసవిలో ఎండల గడిపే సమయం పరిమితం చేయాలన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో ఇంట్లో నుంచి బయటకు వెళ్లే సమయంలో రక్షణ దుస్తులు, కళ్లద్దాలు, టోపీలను ధరించాలని పేర్కొన్నారు. వదులుగా, తేలికైన, పొడవాటి చేతుల చొక్కాలు, స్కర్టులు ధరించాలని జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ కృషి



మాట్లాడుతున్న కేజీ ప్రసాద్

తెనాలిఅర్బన్: కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించిదని జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ పేర్కొన్నారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తెనాలి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక నాయకులను అందరూ ఆదర్శంగా తీసుకుని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా పి.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా టి.ఎలిజిబెత్, ఉపాధ్యక్షులుగా టి.రంగపుష్ప, ఎన్.ఆదిలక్ష్మి, కార్యదర్శులుగా పి.పావని, ఎల్.నిర్మలా జ్యోతి, ఎ.సునీత, కోశాధికారిగా షేక్ రజి యా బేగంలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఏబీఎన్ కుమారి, సీఐటీయూ తెనాలి కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ)లో విలీన గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలీన గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 25న ఎంటీఎంసీ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆత్మకూరు దళితవాడకు రెండు మూడు రోజులకు ఒక అరగంట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు డి.నరసింహారావు, మొసలి ఫకీరయ్య, ఉద్దంటి దుర్గారావు, జి.అజయ్, వల్లూరి భారతి పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు రిమాండ్

తెనాలిరూరల్: నిబంధనలు ఉల్లంఘించిన రౌడీషీటర్‌కు తహసీల్దార్ 30 రోజులు రిమాండ్ విధించారు. పట్టణ వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన రౌడీ షీటర్ అన్నం రమేష్ గతంలో ఓ కేసులో నిందితుడు. గతేడాది ఆగస్టు నెలలో ఏడాది పాటు క్రమశిక్షణ కలిగి ఉంటానని అంగీకరిస్తూ తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయ్యాడు. అయితే దానిని ఉల్లంఘిస్తూ గత అక్టోబరు 18న ఓ వ్యక్తిపై ఇనుప రాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు. దానిపై కేసు నమోదు చేసిన పోలీసులు, అదే నెల 29వ తేదీన షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ నెల మూడో తేదీన మరో నోటీసు జారీ చేశారు. దీనికీ ఎటువంటి జవాబు రాకపోవడంతో అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట గురువారం హాజరుపరిచారు. గతంలో అతని బైండోవర్ విషయాన్ని, దాన్ని ఉల్లంఘించిన విధానాన్ని తహసీల్దార్‌కు వివరించారు. ఫలితంగా నిందితుడు రమేష్‌కు 30 రోజులు రిమాండ్ విధించి, రేపల్లె సబ్ జైలుకు తరలించాల్సిందిగా తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆదేశాలు జారీ చేశారు.